క్లుప్తంగా

నేడు అమృత్ సరోవర్ ప్రారంభం

సోమల: నెల్లిమంద పంచాయతీలో బుధవారం కేంద్ర ప్రభుత్వ అమృత్ సరోవర్ కార్యక్రమాన్ని ప్రారం భించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజ, ఏపీఓ దినకర్‌బాబు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నాలని పేర్కొన్నారు.

నేడు పార్వతీ కల్యాణం

సదుం: మండలంలోని నడిగడ్డ పంచాయతీ మల్లెంకొండతోపులోని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ని ర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వాటర్‌షెడ్ పనులకు భూమి పూజ



సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లెలో వాటర్‌షెడ్ పనులకు మంగళవారం ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. రచ్చబండ కట్టనున్నట్లు వారు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ రెడ్డిదీప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, నాయకులు రెడ్డెప్పరెడ్డి, మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

గుడుపల్లె: మద్యం, సారా అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను బుధవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలీస్ స్టేషన్ వద్ద 6 ద్విచక్రవాహనాలు, ఒక కారును వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వే లు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కన్వీనర్లదే కీలక పాత్ర

రొంపిచెర్ల: గ్రామాభివృద్ధిలో సచివాలయ కన్వీనర్లే కీలక పాత్ర పోషించాలని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కన్వీనర్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా కన్వీనర్లు కృషి చేయాలని అన్నారు. ఎక్కడైన అభివృద్ధి పనులు కుంటు పడితే గుర్తించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎంపీటీసీ సీరాజున్నీసా, కార్యదర్శి నాగరాజ, నాయకులు కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను విడుదల చేస్తున్న ప్రభాకర్, త్యాగరాజు

పుంగనూరు : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో కైవారం నారాయణస్వామి మఠం(కర్ణాటక) క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. మఠం డైరెక్టర్ ప్రభాకర్‌తో కలసి బలిజ సంఘ పట్టణ నాయకులు పూల త్యాగరాజు, నానబాల గణేష్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. త్యాగరాజు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి గాంచిన మఠం క్యాలెండర్లను సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మఠం సేవా కార్యక్రమాలను వివరించారు. సంఘం నాయకులు డాక్టర్ పూల ప్రభా కర్, నాన బాలమణి, బండిబాలు, మధుసూదన్‌రాయల్, ఎస్‌వీటీ సోము, గోపిరాయల్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



జస్వంత్‌తో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి జస్వంత్ జాతీయ స్థాయి అండర్–14 త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవి తెలిపారు. నంద్యాలలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంఈఓ హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కొండారెడ్డికి సన్మానం



పలమనేరు: ఇటీవల వేదిక్ యూనివర్శిటీ నుంచి సామాజిక సేవా విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న కూర్మాయి కొండారెడ్డిని స్థానిక ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం సన్మానం చేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను నిర్వహించి మన్ననలు అందుకోవాలని కోరారు.

భోజనం నాణ్యతగా ఉండాలి

సోమల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ కేశవపిళ్లై తెలిపారు. మంగళవారం చెన్నయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యా హ్న భోజనం రుచి చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



నందవనం కళాశాలలో బెంచీలను వినియోగంలోకి తెస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కొత్తపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులు, భూగర్భశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలో మంగళవారం నాలుగో రోజు పల్లెబాట కార్యక్రమంలో 6 పంచాయతీల్లోని 46 గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో మహిళలు హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరి స్తూ..అభివాదం చేస్తూ పర్యటన సాగించారు. తమకు చేకూరిన పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రతి ఒక్కరూ మంత్రి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఎల్లంకివారిపల్లె, పోశంవారిపల్లె, కల్లూరు, కొమ్మిరెడ్డిగారిపల్లెలో ఆర్‌ఓ ప్లాంట్‌లు, కావేటిగారిపల్లెలో వైఎస్సార్ హెల్త్‌సెంటర్, రైతు భరోసా కేంద్రం, దిన్నెపాటి దళితవాడలో కమ్యూనిటీ హాల్, కల్లూరులో జిల్లా పరిషత్ అతిథి భవనాలను ప్రారంభించారు.

జూనియర్ కళాశాలలో బెంచీల ప్రారంభం

కొత్తపేట నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దాత దశరథరెడ్డి (ఎసీటీఎస్ స్వచ్ఛంద సంస్థ) వితరణగా అందజేసిన 60 బెంచీలు(డెస్క్)లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వినియోగంలోకి తెచ్చారు. దాతను అభినందించారు.

సంచార పశువైద్య వాహనం ప్రారంభం

కల్లూరులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. రైతుల ముంగిటకే ఈవాహనం ద్వారా పశువైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ లబ్ధి ఇంటి ముంగిటకే అందుతోందని పేర్కొన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పెద్దిరెడ్డి, జిల్లా ప్రిటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పీఏ మునితుకారాం, ఎస్ఎస్‌రెడ్డి ప్రకాష్, పోకలచంద్ర, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, షకూర్, సౌకత్‌అలీ, రాఘవరెడ్డి, రాజశేఖరరెడ్డి, సైఫుల్లా, ఆనంద, రెడ్డి బాబుల్లా, విజయకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు భేష్



కేంద్ర బృందం సభ్యులను సన్మానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చాలా బాగుందని కేంద్ర బృందం సభ్యులు కితాబిచ్చారు. జిల్లాలో పదిరోజులుగా కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణాభివృద్ధి శాఖలో జరుగుతున్న పనులను పరిశీలనకు విచ్చేసిన కేంద్ర బృందం సభ్యులైన సత్యబెహరా, శశికుమార్‌సాహు మంగళవారం పల్లెబాట కార్యక్రమంలో ఉన్న మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి బాగా జరిగిందని, ఇందులో మంత్రిగా మీ సహకారం ఎంతో ఉందని తమ పర్యటనలో తెలిసిందని రామచంద్రారెడ్డికి వివరించారు. ఏపీలో ఉన్న వ్యవస్థలు ఇతర రాష్ట్రాలో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయ పడ్డారు.అనంతరం కేంద్ర బృందం సభ్యులను మంత్రి సత్కరించారు.

గృహ సారథుల శిక్షణపై సమీక్ష

సోమల: గృహ సారథుల శిక్షణ తరగతులపై మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీ ఆదేశాల మేరకు ప్రతి వలంటీర్‌కు ఇద్దరు చొప్పున గృహ సారథుల అనుసంధానం చేస్తూ నియమించినట్లు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో వీరికి శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఐలా సూరి పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ.2.60 లక్షల ఆదాయం

గంగవరం: గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం వేలం నిర్వహించారు. చిత్తూరు సెబ్ పోలీసులు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 16 ద్విచక్ర వాహనాలు, 2 కార్లను వేలం వేయగా, రూ.2.60 లక్షలు ఆదాయం వచ్చింది.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

సదుం: మండలంలో గాండ్లపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోరు ఏర్పాటుకు ఆరు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ రెడ్డిదీప మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప సూచనలతో పనులు చేపట్టామన్నారు. సమస్య పరిష్కారం దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు



స్థలం కేటాయిస్తున్న తహసీల్దార్

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలం కేటాయిస్తున్నట్లు తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లెలో ఎస్టీ మాదిగపల్లె, ఎస్సీ కాలనీ గ్రామస్తులకు సర్వే నెంబర్ 123లో 50 సెంట్లు స్థలం మంజూరు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్‌ఓ శివయ్య పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధిని ప్రజల ముంగిటకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం మండలంలోని కలగటూరు సచివాలయ పరిధిలోని అరసనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదని, పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పింఛన్లు అందడమే కాకుండా ఒకటో తేదీనే ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల పురోగతిని మార్చి కార్పొరేట్‌కు దీటుగా మార్చినట్లు పేర్కొన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, వాహనమిత్ర, జగనన్న చేదోడు, సున్నా వడ్డీకే రుణాలు, వసతి దీవెన ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, మూడున్నరేళ్లలోనే 95శాతం హామీలను ముఖ్యమంత్రి జగనన్న నెరవేర్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదిస్తే మరిన్ని పథకాలను తీసుకువస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, చలపతిరెడ్డి, నల్లపరెడ్డి, పటాభిరామయ్య, బాబురెడ్డి, కేశవరెడ్డి, శీన, మురళీరెడ్డి, నరసింహులు, ఎంపీడీవో శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా పుంగనూరు



మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: పుంగనూరును అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. మంగళవారం చైర్మన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి, ఆదర్శ మున్సిపాలిటిగా నిలుపుతున్నామన్నారు. పట్టణంలో టిడ్కో ఇండ్ల ద్వారా 1,536 మందికి గృహాలు కేటాయించామని, మరో 3600 మందికి జగనన్న కాలనీల్లో ఇండ్ల పట్టాలు అందించినట్లు వివరించారు. జగనన్న కాలనీల్లో రూ.13 కోట్లతో కాలువలు, రోడ్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి ఆదేశాల మేరకు జగనన్న కాలనీలను టౌన్‌షిప్‌లుగా మార్చుతున్నామన్నారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరు మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రజలందరు ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రసూల్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై శివపార్వతులు



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లు సింహ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి,అమ్మవార్లు శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో తెలిపారు.

వీధి బాలల సంక్షేమం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు

పుంగనూరు: వీధి బాలలను గుర్తించి వారికి తగిన చేయూత నందించాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. మంగళ వారం వీధి బాలల దినోత్సవాన్ని పట్టణంలోని ఎన్ఎస్‌పేట పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి మాట్లాడుతూ వీధి బాలలను గుర్తించి ఎప్పటికప్పుడు వారిని సంబంధిత సంక్షేమ వసతిగృహాల్లో చేర్పించి, తగిన విద్య అవకాశాలు కల్పించాలన్నారు. వీధి బాలల తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కల్పించాలని, బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకుంటే కేసులు నమోదుచేసి, కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. వీధి బాలల కుటుంబాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలి



వెలుగు సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: సంక్షేమ పథకాలపై మహిళలకు వెలుగు శాఖలో పనిచేస్తున్న సంఘ మిత్రలు, వీఓ లీడర్లు, ఎస్‌హెచ్‌జీ లీడర్లు, సీసీలు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాయలంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధితోనే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బాగుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని మహిళలకు క్షేత్రస్థాయిలో వివరించాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు గ్రామ స్థాయిలో వెలుగు శాఖ సేవలు, వలంటీర్లు పనితీరు హర్షణీయమని ప్రశంసించారు. రాజకీయ నాయకుల కంటే వలంటీర్లకు ప్రజలతో సత్సంబంధాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వెలుగు సిబ్బంది, వలంటీర్లు వారధులుగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, పార్టీ పరిశీలకుడు నరేష్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

టైలర్ భూములు పరిరక్షించాలని వినతి

కుప్పం పరిసరాల్లోని టైలర్ హైస్కూల్ భూములను కాపాడాలని ఎమ్మెల్సీ భరత్‌కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు వినతి చేశారు. మంగళవారం కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలసి వినతి పత్రం అందజేశారు.1980లో అమెరికాకు చెందినా టైలర్ లేబర్ ఆఫ్ సొసైటీ పూరిటా కుప్పంలో భూములు కొనుగోలు చేసి పాఠశాలను నెలకొల్పారని తెలిపారు. ప్రస్తుతం ఆ భూములు బేవనపల్లె రెవెన్యూ పరిధిలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. లేబర్ సొ సైటీ పేరిట ఉన్న భూములు టైలర్ పాఠశాలకు సంబంధించనవని, క్రయవిక్రయాలపై ఎవరికీ హక్కు లేవని పేర్కొన్నారు.ఈ భూములను పరిరక్షించాలని కోరారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ సురేష్, హఫీజ్, సుదర్శన్, మురళీమోహన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

అదనంగా జగనన్న కాలనీలు కావాలి



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన రామకుప్పం వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మండలంలోని పలు సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మంత్రి పెద్దిరెడ్డిని కల్లూరులో కలిసి సమస్యలను విన్నవించారు. మండలానికి జగనన్న కాలనీలు అదనంగా కావాలన్నారు. అదేవిధంగా 89 పెద్దూరు–అంబూరు, రామాపురం తండా–జీడిమాకులపల్లె, గురుకులమడుగు– దేవరాజపురం అటవీ ప్రాంత పరిధిలో నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. మంత్రిని కలసిన వారిలో ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, రెస్కో డైరెక్టర్ రవినాయక్, సర్పంచ్ మోహన్‌నాయక్, నేతలు భాస్కర్‌నాయక్, చిన్నరాజునాయక్ ఉన్నారు.

ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేద్దాం



సదుం: సమావేశంలో మాట్లాడుతున్న జింకా చలపతి, పక్కన పెద్దిరెడ్డి

సదుం: రానున్న ఎన్నికల్లో మండలంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజారిటీ సాధనకు ఇప్పటి నుంచి సైనికుల్లా పని చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తొమ్మిది పంచాయతీల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, నూతనంగా నియమితులు కానున్న గృహసారథులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కీలకం కానున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదని ఆరోపించారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పథకాలను మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. టీడీపీ సానుభూతి పరుల గృహాలకు సైతం వెళ్లి గత మూడేళ్లలో ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని తెలియజేసి, వారి ఓట్లు సైతం వైఎస్సార్ సీపీకి వచ్చేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి మండలంలో 15 వేలు మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు



సూచనలిస్తున్న ఏపీడీ వరప్రసాద్

చౌడేపల్లె: ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ వరప్రసాద్ సూచించారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో సమావేశం జరిగింది. ఏపీడీ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం వంద రోజులు పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులకు 90 పనిదినాలు కల్పించాలని తెలిపారు. ప్రతి రైతుకు ఉపాధి పథకంలో లబ్ధి పొందేలా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పంచాయతీ వారీగా కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. రోజు కూలీల పనిచేసే ప్రదేశం నుంచి ఎన్ఎంఎంఎస్ యాప్ నుంచి రోజుకు రెండు సార్లు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏడు రకాల రిజిష్టర్లు, వర్క్‌ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఏపీఓ శ్రీనివాస్ యాదవ్, జెఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మండలంలోని ఎస్సీ,ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశం తహశీల్దార్ సీతారామన్, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ సభ్యులు పలు సమస్యలను సమావేశంలో వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీల వ్యక్తిగత సమస్యలు, భూ పంపిణీ కార్యక్రమాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలను గుర్తించి మరో కమిటీ సమావేశం లోపు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులతో పాటు కమిటీ సభ్యులు రాజు, శ్రీనివాసులు, భానుప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

కుప్పం: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. సాధారణ కౌన్సిల్ సమావేశం మంగవారం చైర్మెన్ డాక్టర్ సుధీర్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యులు తమ వార్డు పరిధిలోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం చూపుతున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. రెండవ వార్డు సభ్యుడు మునిరాజ్ మినిట్స్ బుక్‌ను సైతం చించివేసి, పలుసార్లు సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం పేర్కొన్నారు. పలువురు కౌన్సిలర్లు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో రసాభాసగా మారింది. దీంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రవిరెడ్డి ప్రకటించారు. సమావేశానికి మీడియాను అనుమతించలేదు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులను విచారిస్తున్న ఎంఈఓ కేశవరెడ్డి

చౌడేపల్లె: పందిళ్లపల్లె ప్రాథమికపాఠశాల, మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంఈఓ కేశవరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఎంఈఓ స్పందించారు. విద్యార్థులు, తల్లితండ్రులు, గ్రామస్తులతో భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. మరింత నాణ్యత ప్రమాణాలను పాటించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. వైరల్ ఫీవర్ కారణంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు విచారణలో తేలినట్లు వెల్లడించారు. హెచ్‌ఎం నాగమల్లిక పాల్గొన్నారు.